



# గవర్నర్ వైఖరి మాకు సానుకూలమే

**మున్ముందు కూడా ఇలాగే కొనసాగాలి ● సీఎం స్టాలిన్ ఎద్దేవా**



తమిళనాడు హౌసింగ్ బోర్డు నిర్మించిన క్వార్టర్స్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఎం

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా తమ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి మున్ముందు కూడా ఇదే విధానాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నట్టు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. గవర్నర్ వైఖరి తమ ప్రభుత్వానికి మంచిదేనని, అందుకే భవిష్యత్‌లో కూడా ఆయన తన వైఖరిని కొనసాగించాలని కోరుకుంటున్నట్టు ఎద్దేవా చేశారు. ఉత్తర చెన్నైలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తాను మేయర్‌గా, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయం నుంచి చెన్నై నగరం ముఖ్యంగా ఉత్తర చెన్నై అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వర్షపునీటి కాల్వలు, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నగరంలో 10 ప్రాంతాల్లో వంతెనలు నిర్మించడంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఇపుడు రాష్ట్రంలోనే కాకుండా, చెన్నై నగర పాలక సంస్థలో కూడా డీఎంకే చేతిలోనే అధికారం ఉందన్నారు. దీంతో ఉత్తర చెన్నై అభివృద్ధి కోసం రూ.1,000 కోట్లు కేటాయించామన్నారు. ఆ తర్వాత వివిధ శాఖ సహకారంతో ఈ మొత్తాన్ని రూ.6,350 కోట్లకు పెంచామన్నారు. ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద 252 పనులు చేపట్టగా, ఇప్పటికు 30 పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు మరో యేడాదిలో పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా ఈ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గవర్నర్ రవి అన్ని విధాలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. ఇలా ఆయన పదేపదే విమర్శలు చేయడం వలన తమతో పాటు ప్రజల్లోనూ వేగం, కసి పెరుగుతాయన్నారు. ఆయన వైఖరి ప్రభుత్వానికి నవ్వు తెప్పిస్తోందన్నారు. కామరాజర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకాన్ని రద్దు చేశారని, ఇలాంటి వాటిపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, ఈ నెల 4వ తేదీన విచారణకు రానుందన్నారు. పెరియార్‌ను అగౌరవపరిచేలా మాట్లాడేవారికి తాను గౌరవం ఇవ్వలేనన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎలాంటి హాని కలగలేదని, రాష్ట్రం శాంతివనంగా ఉందని పేర్కొన్నారు. స్టాన్లీ ఆస్పత్రి రోడ్డులో తమిళనాడు హౌసింగ్ బోర్డు నిర్మించిన క్వార్టర్స్ పరిశీలించిన సీఎం.. లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లబ్దిదారులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## టీవీకే ఎన్నికల ప్రచార కార్యదర్శిగా ఆదవ్ అర్జున్



ఆదవ్ అర్జున్‌కు నియామక పత్రం అందజేస్తున్న విజయ్

అడయార్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డీపీఐ నుంచి వైదొలగి తమిళగ వెట్రి కళగం(టీవీకే)లో చేరిన ఆదవ్ అర్జునన్‌కు ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ కీలక బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా ఆదవ్ అర్జునన్‌ను నియమించారు. ఈ మేరకు టీవీకే ప్రధాన కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. అలాగే, పార్టీ ప్రధాన కార్యాలయ కోట్రెజరర్‌గా పి.జగదీష్, ప్రచార విభాగం కార్యదర్శిగా ఎ.రాజ్‌మోహన్, టీవీకే ఐటీ విభాగం సహాయ ప్రధాన కార్యదర్శిగా సీటీఆర్ నిర్మల్ కుమార్, పార్టీ ప్రచార విభాగ సహాయ కార్యదర్శులుగా లయోలా మణి, ఎ.సంపత్‌కుమార్, కేథరిన్ పాండియన్, అధికార ప్రతినిధిగా వీరవిఘ్నేశ్వరన్, మీడియా ఇన్‌చార్జ్‌గా ఆర్.గురుమూర్తిని నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు.



ఖాళీ బోగీలతో వంతెనపై వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు

# 11న పాంబన్ ప్రారంభం

**● తైపూసం రోజున జాతికి అంకితం చేయనున్న మోదీ**
**● ట్రయల్ రన్ విజయవంతం ● 18 బోగీలతో నడిచిన ఎక్స్‌ప్రెస్ రైలు**



వంతెన దాటుతున్న కోస్ట్ గార్డ్ నౌక

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలో కొత్తగా నిర్మించిన పాంబన్ రైల్వే వంతెన ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 11న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీనిని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం 18 బోగీలతో ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్‌ను రైల్వే అధికారులు శుక్రవారం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నెల 11వ తేదీ తైపూసం కావడంతో ఆ రోజును వంతెన ప్రారంభానికి ముహూర్తం ఎంచుకున్నారు. అన్నీ అనుకూలిస్తే 11వ తేదీ కంటే ముందుగానే ఈ వంతెనను ప్రారంభించి జాతికి అంకితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. ఈ వంతెన ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ ముందుగా మండపంలోని ఇండియన్ కోస్ట్ గార్డ్ కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నౌకలో పాంబన్‌కు చేరుకుని, పాంబన్ వద్ద కొత్తగా నిర్మించిన రైలు వంతెనతో పాటు పాత వంతెన కూడా ఆయన పరిశీలిస్తారు. ఆ తరువాత కొత్త వంతెనపై రైళ్ళ రాకపోకలను ప్రారంభించి, అదే రైలులో ఆయన ప్రయాణం చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. రామేశ్వరం లేదా మండపంలో ప్రారంభోత్సవ వేడుక భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లలో భాగంగా ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన నౌక శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కొత్త వంతెన కింద నుంచి వెళ్ళింది. అలాగే, కొత్త వంతెనపై కూడా 18 బోగీలతో ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించారు. గురువారం రాత్రి కన్నియాకుమారిలో బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో మండపం స్టేషన్‌కు చేరుకుంది. ఈ రైలులో వచ్చిన ప్రయాణికులందరినీ మండపం స్టేషన్‌లో దించి, బోగీలన్నింటినీ లాక్ చేశారు. ఆ తర్వాత ఉదయం 6 గంటలకు మండపం స్టేషన్ నుంచి బయలుదేరిన 18 బోగీలతో కూడిన ఎక్స్‌ప్రెస్ రైలు 60 కిలోమీటర్ల వేగంతో వంతెనపై మీదుగా వెళ్లి కేవలం 25 నిమిషాల్లో దాటేసింది.

### 1914 నాటి వంతెన...

1914లో నిర్మించిన ఈ వంతెన శిధిలావస్థలకు చేరుకోవడంతో కొత్త వంతెన నిర్మించాలని నిర్ణయించారు. ఈని కోసం 2019లో నిధులు కేటాయించగా, 2022 మేలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. 2022 డిసెంబరు నాటికి పనులు పూర్తిచేయాలని నిర్ణయించగా, కొవిడ్, విపత్తుల కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. ఈ క్రమంలో, పాతవంతెన పటిష్టత కోల్పోయిందని నిర్ధారించిన అధికారులు.. 2022 డిసెంబరు నుంచి రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. గత ఏడాది సెప్టెంబరు 30వ తేదీతో వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రైల్వే భద్రతా కమిషనర్ పరిశీలన అనంతరం కొత్త వంతెనపై 78 కి.మీ వేగంతో రైలు నడిపేందుకు అనుమతించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాంబన్ కొత్త వంతెన మధ్యలో ఏర్పాటుచేసిన లిఫ్ట్ వంతెన పూర్తిగా పైకి లేపడంతో కోస్ట్ గార్డ్ నౌక వంతెన దాటుకుంటూ వెళ్లింది.



విజేతలతో మేఘనాథ రెడ్డి, కె.అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

# విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

**● ఐఏఎస్ అధికారి జె.మేఘునాథ రెడ్డి**
**● ఘనంగా వేణుగోపాల్ విద్యాలయ స్పోర్ట్స్ మీట్**



జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని, తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని వేణుగోపాల్ విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం 44వ స్పోర్ట్స్ మీట్ ఘనంగా జరిగింది. ఎగ్మోర్ రాజరత్నం స్టేడియంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కె.అనిల్‌కుమార్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేఘనాథ రెడ్డి స్పోర్ట్స్ పతాకం ఆవిష్కరించి, క్రీడా జ్యోతి వెలిగించి, క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, క్రీడోత్సవాలను ప్రారంభించారు. అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో వేణుగోపాల్ విద్యాలయం తరుపున పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఈ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాంచీలోని ఓ ఫామ్‌హౌస్‌లో భూములకు సాగునీరందించే పంపు ఆపరేటర్‌గా పనిచేసిన ఓ రైతు కుమారుడు మహేంద్ర సింగ్ ధోని క్రికెట్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రతిభ కనబరచి, భారతదేశానికే గర్వకారణంగా నిలచిన వ్యక్తి అని, ఆయన చదువులో రాణించకపోయినా, క్రీడా రంగంలో శిఖరాన్ని చేరుకుని ఎంతోమంది ఆదరాభిమానాలను పొందుతున్నారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలి విద్యార్థులకు సూచించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మార్గదర్శాలతో క్రీడా రంగం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి క్రీడాకారులను ప్రోత్సాహిస్తూ గత మూడేళ్లలో పతకాలు సాధించిన సుమారు 4వేల మంది క్రీడాకారులకు రూ.1.50కోట్ల నగదు బహుమతి పంపిణీ చేశారన్నారు. వేణుగోపాల విద్యాలయ యాజమాన్యం నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్ది దేశానికి మంచి పౌరులను అందజేసిందని మేఘనాథ రెడ్డి ప్రశంసించాచారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాడెంట్, కార్యదర్శి వి.గోవింద్, ఉపాధ్యక్షులు కె.ఆనంద్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి కె.రంగారెడ్డి, చెన్నై టీటీడీ సలహామండలి మాజీ సభ్యుడు బి.మోహన్ రావు, ప్రధానోపాధ్యాయురాలు షీలా, వ్యాయామ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎన్ఎల్‌సీ పురోగతిపై కేంద్రమంత్రి సమీక్ష



కేంద్ర మంత్రితో ప్రసన్నకుమార్ తదితరులు

అడయార్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) పనితీరు, పురోగతిపై కేంద్ర ఖనిజ, బొగ్గు గనుల శాఖామంత్రి జి.కిషన్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చెన్నైలో జరిగిన ఈ సమావేశంలో ఎన్ఎల్‌సీఐఎల్ సీఎండీ ప్రసన్నకుమార్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... '2047 నాటికి ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించే 'వికసిత్ భారత్' కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మైనింగ్ శాఖలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టబోతున్నట్టు తెలిపారు. దేశంలో అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎన్ఎల్‌సీఐఎల్ ఒకటని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేస్తూ, ఉన్నతాధికారులను ప్రశంసించారు. ముఖ్యంగా తలబిరా, సౌత్ పచ్వర, నార్త్ ధాడు, మచ్చకట, పత్రపర వంటి బొగ్గు గనుల్లో తవ్వకాల సామర్థ్యాన్ని పెంచడం హర్షణీయమన్నారు. అలాగే తలబిరా 3-800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మించడంలో ఎన్ఎల్‌సీఐఎల్ కృషిని మంత్రి అభినందించారు. రాజస్థాన్, అస్సోం, అండమాన్ అండ్ నికోబార్ దీవులలో పెద్ద ఎత్తున పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచడంలో, ఇతర గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాల్లో ఎన్ఎల్‌సీ కృషిని మంత్రి కిషన్ రెడ్డి ప్రశంసించారు.

# వెంకయ్య మనవడి వివాహ రిసెప్షన్

**● వేడుకకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరు**





వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం స్టాలిన్ దంపతులు - ఉపరాష్ట్రపతి దంపతులు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి కుమార్తె దీపా-వెంకట్ దంపతుల కుమారుడు విష్ణు, తుమ్మల రాధిక-కోటేశ్వరరావు దంపతుల కుమార్తె సాత్వికల వివాహ రిసెప్షన్ శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని కల్యాన్ సముద్ర ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాజకీయ, పారిశ్రామిక, సినీ ప్రముఖులతో పాటు వివిధ రంగాల ప్రముఖులంతా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వెంకయ్యనాయుడు-ఉష దంపతులు, వెంకయ్య కుమారుడు హర్షవర్దన్-కోడలు రాధ, హర్షవర్దన్ కుమార్తెలు నిహారిక, వైష్ణవి దంపతులు, దీప కుమార్తె సుష్మ దంపతులు దగ్గరుండి వేడుక పర్యవేక్షించారు. వివాహానికి ముందు జరిగిన రిసెప్షన్‌కు భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు, లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనా రెడ్డి, గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, ఎల్.మురుగన్, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామ కృష్ణమరాజు, ఏపీ మంత్రి సత్య కుమార్, ఎండీఎంకే అధినేత వైగో, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కెన్సెస్ గ్రూపుల అధినేత నరసారెడ్డి, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, సినీ నటులు మురళీమోహన్, సాయికుమార్, శుభలేఖ సుధాకర్ తదితరులు ఈ వేడుకకు హాజరయ్యారు.



నూతన వధూవరులతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా తదితరులు

## సమాచార దర్శిని

### కాశీ తమిళ సంగమానికి ప్రత్యేక రైలు

పెరంబూర్,జనవరి31(ఆంధ్రజ్యోతి): కాశి తమిళ సంగమం కార్యక్రమానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం చెన్నైసెంట్రల్-బెనారస్- చెన్నై సెంట్రల్‌మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06193 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-బెనారస్ ప్రత్యేకరైలు ఈనెల 13వతేది మధ్యాహ్నం 2.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరి మూడవరోజు ఉదయం 7.15 గంటలకు బెనారస్ చేరుకుంటుంది. మరు మార్గంలో నెం.06194 బెనారస్-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 19వ తేది వేకువజామున 2 గంటలకు బెనారస్‌లో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

### నేటినుంచి మూడు జిల్లాలకు భారీ వర్షసూచన

ప్యారీస్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దక్షిణ ఆగ్నేయ బంగాళాఖాతంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాలు, దక్షిణ తమిళనాడులో ఫిబ్రవరి 1 నుంచి మోస్తరు, భారీవర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నుంగంబాక్కంలోని ఐఎండీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... ఉపరితల ఆవర్తనం రాష్ట్రంలోని దక్షిణం వైపు మెల్లగా కదులుతోందని, ఇది సమీపిస్తున్న కొద్దీ దక్షిణ, ఉత్తర తమిళనాడులో పలు ప్రాంతాల్లోను, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. శుక్రవారం రెండు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. 1 నుంచి 5వ తేది వరకు ఉదయం వేళ మంచు కురుస్తుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

### కార్మిక శాఖ కార్యాలయాల చిరునామా మార్పు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుదళగంలో పనిచేస్తున్న కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ల కార్యాలయ చిరునామా మారింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్-2, అసిస్టెంట్ కమిషనర్-2, డిప్యూటీ కమిషనర్-3 తదితర మూడు కార్యాలయాలు ఈ నెల 1వ తేదీ నుంచి 'వావూ మాన్సన్, 48/39, 7వ అంతస్తు, రాజాజీ రోడ్డు, చెన్నై-600001' పనిచేస్తాయని సచివాలయం తెలిపింది.

### సాహిత్య అకాడమీ పురస్కారానికి రచనల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సాహిత్య అకాడమీ పురస్కారానికి రచయితలు ఈ నెల 28వ తేదీలోపు తమ రచనలు పంపించాలి. కేంద్ర సాంస్కృతిక శాఖ 1955 నుంచి బెంగాలీ, బోడో, డోగ్రీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడం, తెలుగు, తమిళం సహా 24గుర్తింపు పొందిన భాషల్లో ప్రచురింపబడిన ఉత్తమ నవలలకు ప్రతి సంవత్సరం సాహిత్య అకాడమీ పురస్కారం అందజేస్తోంది. పురస్కార గ్రహీతలకు సాహిత్య అకాడమీ లోగోతో కూడిన కేడియం, రూ. లక్ష చెక్ అందజేస్తుంటారు. ఈ ఏడాది పురస్కారానికి 2019 నుంచి జనవరి నుంచి 2023 డిసెంబరు వరకు మొదట ప్రచురించబడిన పుస్తకాలు, రచయితలు, ప్రచురణకర్తలు, రచయిత శ్రేయోభిలాషులు నవల ప్రతిని ఈ నెల 28వ తేది లోపు సాహిత్య అకాడమీ కార్యాలయానికి పంపించాలి. అలాగే, సాహిత్య అకాడమీ పురస్కారం నియమ నిబంధనలు www.sahitya.akademi.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

### నేటినుంచి ప్రైవేటు సంస్థల పాల ధరల పెంపు

పెరంబూర్,జనవరి31(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సంస్థలు సరఫరా చేసే పాలు, పెరుగు ధరల పెంపు శనివారం నుంచి అమలులోకి వచ్చింది.. రాష్ట్రంలో చెన్నై మినహా ఇతర జిల్లాల్లో ప్రైవేటు పాలు విక్రయాలు జరుగుతున్నాయి.ఈనేపథ్యంలో పాలధరలు పెంచుతూ ప్రైవేటు సంస్థలు ప్రకటన విడుదల చేశాయి. ఆ ప్రకారం, ప్రైవేటు పాల సంస్థలు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన తిరుమల డైరీ పాలు లీటరుకు రూ.2, పెరుగు లీటరుకు రూ.5 పెంచింది..ఈ పెంపు శనివారం నుంచి అమలుకు రానుండా, మరో సంస్థ జెర్సీ ధరల పెంపు సోమవారం నుంచి అమలులోకి రానుంది. ఆ ప్రకారం, పాలు లీటరు రూ.70 నుంచి రూ.72, 500 మి.లీ ప్యాకెట్ రూ.36 నుంచి రూ.37, స్థిరీకరించిన పాలు లీటరు రూ.62 నుంచి రూ.64, 500 మి.లీ ప్యాకెట్ రూ.32 నుంచి రూ.33కు, సమీకరణ పాలు లీటరు రూ.61 నుంచి రూ.62, 500 మి.లీ ప్యాకెట్ రూ.27 నుంచి రూ.28కి పెరిగింది. అలాగే, పెరుగు లీటరు రూ.67 నుంచి రూ.72, 450 గ్రాముల ప్యాకెట్ రూ.33 నుంచి రూ.37కు పెరిగాయి.

### 3న డీఎంకే ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అన్నాదురై 56వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 3న డీఎంకే ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. కామరాజర్ రోడ్డులోని అన్నాదురై విగ్రహానికి సోమవారం ఉదయం 7 గంటలకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం అక్కడి నుంచి మెరీనా తీరంలో అన్న సమాధి వరకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని డీఎంకే ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది.

# ప్రపంచంలోనే తొలిసారి ఒకే స్తంభంపై ఐదు మెట్రోరైలు పట్టాలు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోరైల్వే సంస్థ నగరంలో ప్రస్తుతం నిర్మిస్తున్న రెండో దశ మెట్రోరైలు మార్గాల ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఒకే స్తంభంపై ఐదు డబుల్ లేయర్డ్ ట్రాక్‌లను నిర్మించనుంది. ప్రపంచంలోనే మొదటిసారిగా ఈ రైల్వే ట్రాక్‌ల నిర్మాణం చేపడుతున్న ఘనత తమ సంస్థకే దక్కుతుందని సీఎంఆర్ఎల్ డైరెక్టర్ అర్జునన్ తెలిపారు. వడపళని ఆర్కాట్‌రోడ్డు ప్రాంతంలో ఈ ఐదు రైలు పట్టాలను నిర్మించడానికి సొరంగాలను నిర్మించాలని ప్రణాళిక రూపొందించామని, దీని అమలుకు రూ.5వేల కోట్లు ఖర్చవుతుందని భావించి, ఈ అదనపు వ్యయభారాన్ని నివారించడానికి ఒకే స్తంభంపై ఐదు డబుల్ లేయర్ల ట్రాక్‌లను నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ వినూత్న విధానం ద్వారా రూ.5వేల కోట్లను ఆదా అవుతుందన్నారు. ఐదు ట్రాక్‌ల బరువు తట్టుకునేలా భూమిలో గట్టి పునాది వేస్తున్నామని, వడపళని నుండి పోరూరు వరకు ఉన్న 4 కిలోమీటర్ల మేర ఐదు ట్రాక్‌లను డబుల్ లేయర్లలో నిర్మిస్తామని, రెండంతస్థుల్లో దిగువ అంతస్థులో రెండు ట్రాక్‌లపై, పై అంతస్థులో మరో రెండు ట్రాక్‌లను నిర్మించి, వాటి పక్కనే మరో లూప్‌లైన్ ట్రాక్ కూడా నిర్మించనున్నామని చెప్పారు. దీంతో నాలుగు రైళ్లను ఒకే స్తంభంపై నడపటానికి వీలు కలుగుతుందన్నారు. రైళ్ల ట్రాక్‌లను మార్చడానికి లూప్‌లైన్ సాయపడుతుందన్నారు.



మెట్రోరైల్వేస్ సంస్థ విడుదల చేసిన ఐదు రైలు మార్గాల ఊహా చిత్రం

## రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్, తిరువణ్ణామలై, కృష్ణగిరి, విల్లుపురం సహా 9 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ..

- తిరునల్వేలి జిల్లా కలెక్టర్ కార్తికేయన్ బదిలీ చేసి ఆయన స్థానంలో ఆర్.సుకుమార్‌ను నియమించారు.
- ధర్మపురి జిల్లా కలెక్టర్‌గా సతీష్
- దిండుగల్ కలెక్టర్‌గా శరవణన్
- కృష్ణగిరి కలెక్టర్‌గా దినేష్‌కుమార్
- విల్లుపురం కలెక్టర్‌గా షేక్ అబ్దుల్ రెహమాన్
- తిరుపత్తూర్ జిల్లా కలెక్టర్‌గా మోహన్‌చంద్రన్
- దిండుగల్ కలెక్టర్ పూంగోడిని వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేయగా, ధర్మపురి జిల్లా కలెక్టర్ శాంతిని సెరికల్చర్ డైరెక్టర్‌గా , టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా ఇన్నోసెంట్ దివ్య, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా కన్నన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ కమిషనర్‌గా లలిత్ ఆదిత్య నీలంను నియమించారు.

## శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లను విడిపించాలి

● రామేశ్వరంలో జాలర్ల సంఘాల ఆందోళన



ధర్నాలో జాలర్ల సంఘాలు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో బందీలుగా ఉన్న రాష్ట్ర జాలర్లను విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరంలో జాలర్ల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి గత ఏడాది డిసెంబరు 23, జనవరి 25వ తేది చేపల వేటకు వెళ్లిన రామేశ్వరానికి చెందిన 49 మంది జాలర్లన శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. అలాగే, జాలర్లకు చెందిన 5 ఫైబర్ పడవలను కూడా లంక స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లను విడుదల చేయించాలి, శ్రీలంక అమానుషదాడులు అడ్డుకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరం బస్టాండ్ సమీపంలో శుక్రవారం జాలర్ల సంఘాలు ధర్నా నిర్వహించారు.

## ఘనంగా మహర్షి విద్యామందిర్ వార్షికోత్సవం



విజేతలతో నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ) ఛారిటీస్ నిర్వహణలోని మహర్షి విద్యామందిర్ సీనియర్ సెకండరీ పాఠశాల దశమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో జరిగినఈ కార్యక్రమంలో గౌరవ కరెస్పాండెంట్ టీవీ రామకుమార్ స్వాగతం పలికి, ముఖ్య అతిథి రోటరీ జిల్లా 3234 గవర్నర్ ఎస్ఎస్ శరవణన్‌ను సభకు పరిచయం చేశారు. ప్రిన్సిపాల్ పి.సుబ్రమణ్యం వార్షిక నివేదిక వినిపించారు. పాఠశాల తరుపున ఒక్కొక్క విద్యాసంవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్య అతిథి శరవణన్ ఉత్తమ విద్యార్థులు, టీచర్లు, పాఠశాల సిబ్బందికి బహుమతులు, జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, ఎస్ఎల్ సుదర్శనం, సీఆర్ కిషోర్‌బాబు, టీఎస్ బద్రినాథ్, పాఠశాల మేనేజర్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ కవిత, టీచర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


## హాస్టల్ విద్యార్థులకు 'బ్యూటీ కేర్ కిట్'

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న కళాశాల విద్యార్థులకు బాత్ సోప్, షాంపూ సహా ఏడు వస్తువులతో కూడిన 'బ్యూటీ కేర్ కిట్' అందించాలని థాడ్కో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 170 ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో సుమారు 19వే మంది విద్యార్థులు బస చేసి కళాశాలల్లో చదువుతున్నారు. విద్యార్థులు సోపు, షాంపూ సహా పలు వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ తరపున నెలకు రూ.150 అందజేస్తున్నారు. కానీ, ప్రస్తుత ధరల కారణంగా ప్రభుత్వం ఇస్తున్న నగదు సరిపోవడం లేదు. ఈ విషయమై దృష్టి సారించిన థాడ్కో, విద్యార్థులకు మూడు నెలలకు సరిపడా నాలుగు బాత్‌సోప్‌లు, 200 ఎంఎల్ కొబ్బరి నూనె, 200 ఎంఎల్ షాంపూ, రెండు లాండ్రీ సోపులు, అర కిలో వాషింగ్ పౌడర్, పేస్ట్, బ్రష్ తదితరాలతో కూడిన కిట్ అందజేయనుంది. తొలివిడతగా చెన్నై జిల్లాల్లోని ఆదిద్రావిడులు, గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో చదువుకుంటున్న 2,500 మంది విద్యార్థులకు ఈ నెల మొదటి వారం నుంచి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## పురాతన కట్టడాల మరమ్మతులకు రూ.10 కోట్లు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో పురాతన కట్టడాలను అభివృద్ధిపరిచేలా రూ.10 కోట్లు కేటాయించారు. నగరంలో సుమారు 400లకు పైగా ఉన్న పారంపర్య కట్టడాలను సీఎండీఏ పర్యవేక్షిస్తోంది. ఈ కట్టడాలను మరింత అందంగా తీర్చిదిద్దేలా సీఎండీకే ప్రణాళిక సిద్ధం చేసింది. తొలివిడతగా మెరీనా తీరం సమీపంలోని డీజీపీ కార్యాలయం, రాణిమేరి కళాశాల, మద్రాసు విశ్వవిద్యాలయ మెరీనా ప్రాంగణం, రాజధాని కళాశాల, ప్రజాపనుల శాఖ కార్యాలయం, ఎళిలగం, మద్రాసు విశ్వవిద్యాలయ సెంటినరీ భవనం తదితరాలు జాబితాలో చోటుచేసుకున్నాయి. ఈ కట్టడాల ప్రాంగణాల్లో పార్క్‌లు, కొత్తగా శిల్పాలు, విద్యుద్దీపాల ఏర్పాటుకు రూ.10 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

## తీరానికి కొట్టుకొచ్చిన డాల్ఫిన్ కళేబరం



పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సముద్ర తీరానికి డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. తిరుచెందూర్ జీవానగర్-వీరపాండ్యన్‌పట్టణం మధ్య జేజే నగర్ తీరంలో గురువారం సుమారు నాలుగన్నర అడుగుల డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. డాల్ఫిన్ తలపై గాయాలున్నాయి. డాల్ఫిన్ కళేబరం గమనించిన జాలర్లు మత్స్యశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మత్స్య, అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని కళేబరాన్ని పరిశీలించారు. రెండేళ్ల వయస్సు కలిగిన డాల్ఫిన్ పడవ, రాళ్లకు ఢీకొని మృతిచెంది ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం వెటర్నరీ వైద్యులు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం తీరప్రాంతంలో పూడ్చిపెట్టారు.

## తిరువణ్ణామలై హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం తిరువణ్ణామలై అన్నామలైయార్ హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సావమివారిని దర్శించే భక్తులు హుండీలో వేసిన కానుకలను ప్రతినెలా లెక్కిస్తుంటారు. ఆ ప్రకారం, జనవరి నెల హుండీ లెక్కింపు ఆలయ మూడో ప్రాకారం సమీపంలోని అలంకార మండపంలో గురువారం ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.3,45,51,797 నగదు, 112 గ్రాముల బంగారం, 1.96 కిలోల వెండి, విదేశీ కరెన్సీ తదితరాలు కానుకలుగా సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## కొత్తగా 2వేల రూట్లలో స్మాల్ లగ్జరీ బస్సులు

● చెన్నై శివారు ప్రాంతాలకు సర్వీసులు

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 2వేల రూట్లలో స్మాల్ లగ్జరీ బస్సులు నడిపేందుకు కార్పొరేట్ సంస్థలకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రజల రవాణా అవసరాలను పూర్తిచేసే లక్ష్యంతో ఇప్పటివరకు రవాణా సేవలు అందుబాటులోలేని ప్రాంతాల ప్రజలు హైటెక్ వసతులున్న ఈ స్మాల్ బస్సుల్లో ప్రయాణించవచ్చు. ప్రవేటు బస్సు యజమానుల విన్నపాన్ని పరిశీలించిన రాష్ట్రప్రభుత్వం రవాణా వసతులను మెరుగుపరచేలా 25కిలోమీటర్ల వరకు ఈ లగ్జరీ స్మాల్ బస్సులు నడపడానికి అనుమతులిచ్చింది. తాజాగా అనుమతులు ఇచ్చిన ప్రకారం అనుమతించిన రూట్లలో రోజుకు నాలుగు ట్రిప్పులు బస్సులు నడపాల్సివుంటుంది. జిల్లా కలెక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 2వేల రూట్లను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. రాజధాని నగరం శివారు ప్రాంతాలైన తురైపాక్కం, ఆలందూర్, అంబత్తూరు, మనలి, తిరువత్తియూర్, షోలింగనల్లూరు ప్రాంతాల ప్రజలు త్వరలో స్మాల్ లగ్జరీబస్సు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ బస్సుల్లో ఉచిత వైఫై, సీసీ కెమెరాలు, విశాలమైన సీట్లు, ఏసీతో హైటెక్ విధానంలో ఈ బస్సులను డిజైన్ చేశారు. బస్సులు బయలుదేరే ప్రాంతాలు, గమ్యాలు చేరుకునే ప్రాంతాల్లో ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, కలెక్టర్ కార్యాలయం, రైల్వేస్టేషన్‌లు ఉన్నట్లైతే అదనంగా కిలోమీటరు వరకు నడపవచ్చని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న ఏసీ బస్సుల్లో కంటే ఈ ప్రైవేటు లగ్జరీ స్మాల్ బస్సుల్లో ప్రయాణ ఛార్జీలు కూడా అధికం. ఇదిలా ఉండగా రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న బస్సుల్లో హైటెక్ వసతులు కల్పించి, ఆదాయం పెంచేలా చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే, కార్పొరేట్ సంస్థలకు స్మాల్‌బస్ సేవలను అప్పగించడం సరికాదని రవాణా కార్మిక సంఘాలు అభ్యంతరం తెలుపుతున్నాయి.

## నిరసనలకు అనుమతి దరఖాస్తు గడువు పొడిగించేలా చట్ట సవరణ

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నిరసనలకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకొనే గడువు పొడిగించేలా చట్ట సవరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. తిరునల్వేలి జిల్లా మాంజోలై తేయాకు తోటల కార్మికుల సమస్యల పరిష్కారానికి గత ఏడాది నవంబరు 7వ తేది మన్రో విగ్రహం నుంచి చేపాక్కం గెస్ట్ హౌస్ వరకు ర్యాలీకి అనుమతించాలంటూ పుదియ తమిళగం పార్టీ నగర పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించింది. అక్టోబరులో వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో, నిర్దేశిత మార్గంలో ర్యాలీ చేపట్టేందుకు అనుమతి లేదని, ఎగ్మోర్ రాజారత్నం స్టేడియం నుంచి ర్యాలీ చేసేలా మార్గం మార్చుకోవాలని పోలీసుశాఖ సూచించింది. ఆ ప్రకారం, నవంబరు 7వ తేది రాజారత్నం స్టేడియం నుంచి బయల్దేరి గవర్నర్‌ను కలుసుకొని వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆ పార్టీ ప్రకటించిన నేపథ్యంలో, ముందు రోజైన నవంబరు 6వ తేది ర్యాలీకి అనుమతి లేదని పోలీసుశాఖ ప్రకటించింది. ఈ ఉత్తర్వులు జారీచేసిన అధికారిపై చర్యలు చేపట్టాలని, పోలీసుల చర్యల వల్ల పార్టీ ప్రతిష్టతకు భంగం కలిగించేలా ఉన్నాయని, అందువల్ల రూ. కోటి పరిహారం ఇప్పించాలని కోరుతూ పుదియ తమిళగం పార్టీ అధ్యక్షుడు కృష్ణస్వామి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, నిరసనలకు అనుమతి కోరుతూ వినతిపత్రం సమర్పించేందుకు గడువు పొడిగించేలా చట్ట సవరణ చేపట్టాలని సూచించింది. అలాగే, వినతిపత్రం సమర్పించిన 48 గంటల్లో దానిపై చర్యలు చేపట్టాలని నగర కమిషనర్‌ను ఆదేశిస్తూ.. కృష్ణస్వామి పిటిషన్ విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

## వివాహమైన రెండో రోజే ప్రియుడితో నవవధువు పరారీ

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వివాహమైన రెండో రోజే నవవధువు ప్రియుడితో కలసి పరారైన ఘటన సేలం జిల్లాలో చోటుచేసుకుంది. సేలం జిల్లా తులుకానూర్ ప్రాంతానికి చెందిన అయ్యప్పన్ కుమారుడు సంజయ్‌కు, అదే ప్రాంతానికి బంధువు మాధయ్యాన్ కుమార్తె మంజు కు ఈ నెల 26వ తేది వివాహం జరిగింది. ప్రస్తుతం గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్న మంజు ఆత్తూర్ గ్రంథాలయానికి వెళ్లి పరీక్షకు సంబంధించిన పుస్తకాలు చదువుతుండేది. ఆమెకు పూంగవాడి ప్రాంతానికి చెందిన మణికంఠన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఎంఈ పూర్తిచేసిన మణికంఠన్ కూడా గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో, 26వ తేది మంజుకు వివాహమైన మరుసటిరోజు ఆమె మణికంఠన్‌తో వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సంజయ్, తన భార్య కనిపించలేదంటూ ఆత్తూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే సమయంలో మంజు-మణికంఠన్ సేలం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఎస్పీ వీరిని ఆత్తూర్ పోలీస్‌స్టేషన్‌కు పంపగా, పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తనకు ఇష్టం లేని వివాహం చేశారని, తాను మణికంఠన్‌తోనే జీవిస్తానని మంజు స్పష్టం చేసింది. దీంతో సంజయ్‌తో విడాకులు వచ్చే వరకు వేచి ఉండాలని పోలీసులు సూచించారు.

## సాధ్యమైనంత త్వరగా వెబ్‌సైట్‌లో ఎఫ్ఐఆర్

● పోలీస్ కమిషనర్‌కు న్యాయమూర్తి లేఖ

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్ కాపీని వెంటనే పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్‌కు చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి లేఖ రాశారు. కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లు తగిన సమయంలో లభించకపోవడంతో ఆ కేసులు వాదించే న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై మద్రాసు హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.మోహన్‌కృష్ణన్ ఓ కేసుకు సంబంధించి విచారణకు హాజరైన సమయంలో చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఈ విషయమై స్పందించిన న్యాయమూర్తి, ఎఫ్ఐఆర్‌లు సత్వరం పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో నమోదుచేసేలా చర్యలు చేపట్టాలని నగర పోలీసు కమిషనర్‌కు లేఖ రాశారు.

● అంథోనియార్ ఆలయ వేడుకలు..

## రామేశ్వరం నుంచి 3వేల మంది పయనం

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవు అంథోనియార్ ఆలయ వేడుకలకు రామేశ్వరం నుంచి మూడువేల మంది భక్తులు వెళ్లనున్నారు. భారత్-శ్రీలంక మధ్య సముద్రంలో ఉన్న కచ్చాదీవు, రామేశ్వరం నుంచి 12 నాటికల్ మైళ్లు, శ్రీలంక నెడుదీవు నుంచి 18 నాటికల్ మైళ్ల దూరంలో ఉంది. కచ్చాదీవులో ప్రసిద్ధిచెందిన అంథోనియార్ ఆలయ ఉత్సవాలు ప్రతి ఏడాది నిర్వహిస్తుండగా, భారత్, శ్రీలంక ప్రాంతాల భక్తులు పాల్గొంటారు. ఆ ప్రకారం ఈ ఏడాది ఉత్సవాలు మార్చి 14,15 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు హాజరుకావాలని జాఫ్నా బిషప్ నుంచి రామేశ్వరం బిషప్‌కు ఆహ్వానం అందింది. ఈ లేఖను బిషప్ అసోక్వినో శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం బిషప్ మాట్లాడుతూ... కచ్చాదీవు ఆలయ వేడుకలకు 75 ఫైబర్, 16 నాటు పడవల్లో 3వేల మంది భక్తులు వెళ్లనున్నారని తెలిపారు. భక్తులు ఒకరికి రూ.2 వేలు పడవ ఛార్జీగా నిర్ణయించామన్నారు. రామనాథపురం మినహా ఇతర జిల్లాల నుంచి వేడుకల్లో పాల్గొనేందుకు వస్తున్న వారు ఆయా జిల్లా పోలీసు కార్యాలయాల నుంచి ఎన్‌వోసీ తీసుకురావాలన్నారు. ఈ నెల 6వ తేది నుంచి దరఖాస్తులు అందజేయనున్నట్లు, వాటిని పూర్తిచేసి, తగిన సర్టిఫికెట్లతో 25వ తేదిలో పంపించాలని ఆయన వివరించారు.

## ప్రత్యేక రైళ్లు పొడిగింపు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.06012 నాగర్‌కోయిల్-తాంబరం (ఆదివారం) వారాంతపు రైలు ఈ నెల 9 నుంచి జూన్ 29 వరకు, మరుమార్గంలో నెం.06011 తాంబరం-నాగర్‌కోయిల్ (సోమవారం) వారాంతపు రైలు ఈ నెల 10 నుంచి జూన్ 30వ తేది వరకు పొడిగించారు. ● నెం.06035 తాంబరం-కొచ్చువెలి (శుక్రవారం) వారాంతపు రైలు ఈ నెల 7 నుంచి జూన్ 27వ తేది వరకు, మరుమార్గంలో నెం.06036 కొచ్చువెలి-తాంబరం (ఆదివారం) వారాంతపు రైలు ఈ నెల 9 నుంచి జూన్ 29వతేదివరకు పొడిగించారు. ● నెం.06184 తాంబరం-కోవై (శుక్రవారం) వారాంతపు రైలు ఈ నెల 14 నుంచి 28వ తేది వరకు, మరుమార్గంలో నెం.06185 కోవై-తాంబరం (ఆదివారం) వారాంతపు రైలు ఈ నెల 16 నుంచి మార్చి 2వ తేది పొడిగించారు.

## తొమ్మిదవ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి, విద్యార్థులకు కొత్తగా సర్టిఫికెట్ కోర్సులు పరిచయం చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందేలా 9వ తరగతి చదివే సమయంలోనే అదనపు నైపుణ్యాలు పెంపొందించేలా సర్టిఫికెట్ కోర్సులు బోధించనున్నారు. తమిళనాడు వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, సర్టిఫికెట్ కోర్సులను పాఠశాలల్లోని హైటెక్ ల్యాబొరేటరీ ద్వారా పాఠశాలల పనివేళల అనంతరం ఆన్‌లైన్‌లో నిర్వహించనుంది. ఇందులో 9వ తరగతి నుంచి ప్లస్ టూ విద్యార్థులు హాజరుకావచ్చు. ఈ కోర్సులపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా అవగాహన కల్పించాలని ఉన్నత, మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమగ్ర పాఠశాల విద్య డైరెక్టర్ ఆర్తీ సర్క్యులర్ పంపారు.

## అత్యాచారం కేసులో నిందితులకు 20ఏళ్ల జైలుశిక్ష

వేలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలో 2022, మార్చి16న ఓ యువతి తన స్నేహితులతో కలిసి సినిమాకు వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఆ ఆటో ఎక్కింది. ఆ ఆటో డ్రైవర్ మరో ముగ్గురి మిత్రుల సాయంతో ఆ యువతిని కిడ్నాప్‌చేసి, వారంతా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, నిందుతులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచారు. మూడేళ్లుగా విచారణ జరుగుతున్న ఈ కేసు వేలూరు మహిళా కోర్టులోని న్యాయమూర్తి ఎస్.మహేశ్వరి ధర్మాసనం ముందుకు రాగా, నిందుతులు ఒక్కొక్కరికి 20ఏళ్ల జైలు శిక్షతో పాటు 25వేలు జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ మేరకు పోలీసులు నిందితులను వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

## నిషేధిత తాబేళ్లు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



అధికారులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత తాబేళ్లు తరలిస్తున్న ఇద్దరు మహిళలను కస్టమ్స్ అధికారులు అరెస్ట్ చేశారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి శ్రీలంక మార్గంగా గురువారం మదురై వచ్చిన శ్రీలంకన్ విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో ప్రయాణికుల్లో ఇద్దరు మహిళలు నిషేధిత 13 తాబేళ్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. పుదుకోటకు చెందిన సరస్వతి, తిరుప్పూర్‌కు చెందిన ఉషా బ్యాంకాక్ నుంచి తాబేళ్లు అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తెలుసుకున్న అధికారులు, ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి, అటవీ శాఖకు తాబేళ్లు అప్పగించారు.

## తిరుత్తణి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న స్టేషన్ మేనేజర్, సలహా మండలి సభ్యులు

తిరుత్తణి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు. తిరుత్తణి మీదుగా రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఆంధ్ర ప్రాంతాలకు రైళ్లు నడుస్తుండగా, వేలాది మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్‌ను వినియోగిస్తుంటారు. కానీ, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు తగిన వసతులు లేవనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, తిరుత్తణి రైల్వే స్టేషన్ మేనేజర్ రజనీస్ కుమార్ సింగ్ నేతృత్వంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే స్టేషన్ సలహా కమిటీ సభ్యులు ఎస్వీ రమేష్, బి.భాస్కర్, కె.ఆనందసాయి, ఎంఎల్ శంకర్, అగ్రి వీపీ గణేశన్ పాల్గొన్నారు. రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులపై సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాలు దక్షిణ జనరల్ మేనేజర్ ఆమోదానికి పంపుతామని, ఆమోదం లభించిన వెంటనే స్టేషన్ అభివృద్ధి పనులు చేపడతామని స్టేషన్ మాస్టర్ తెలిపారు.

# నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**చెంబరంబాక్కం:** నజరేత్ పేట, మెప్పూర్, వరదరాజపురం, బెంగళూరు ట్రంక్ రోడ్డు, చెంబరంబాక్కం కొంత భాగం, తిరుమళిసై కొంత భాగం, మలయంబాక్కం కొంత భాగం, అగరమేల్

**తిరువేర్కాడు:** కోలడి రోడ్డు, అన్బు నగర్, మహాలక్ష్మి నగర్, దేవికరుమారి అమ్మన్ నగర్, అన్నై అభిరామి నగర్, రథం వీధి, కృష్ణా నగర్, చిన్న కోలడి, లక్ష్మి నగర్, చెల్లియమ్మన్ నగర్, దేవి నగర్, సెంథిల్ నగర్, శ్రీనివాసన్ నగర్

**కొడుంగైయూర్:** ఆండాళ్ నగర్, అన్నై థెరిస్సా నగర్, ఐశ్వర్య నగర్, సన్నిధి మనలి రోడ్డు, లక్ష్మి అమ్మన్ నగర్ 1 నుంచి 3 వీధులు, తెండ్రల్ నగర్ 1 నుంచి 8 వీధులు, వేదాంత మురుగప్పన్ వీధి, అన్నై అవెన్యూ 1 నుంచి 3 వీధులు, ఎస్సార్ నగర్, విజయలక్ష్మి నగర్, భద్రగిరి నగర్, రాఘవేంద్ర నగర్, గణేశ్ నగర్, సుగంధమ్మాళ్ నగర్, బాలాజీ నగర్, శక్తి నగర్, కేఎంఎ గార్డెన్, టీహెచ్ రోడ్డు, కేకేడీ నగర్ బ్లాక్ 1 నుంచి 9 వరకు, సిడ్కో నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కేఎం నగర్, దామోదరన్ నగర్, గోల్డన్ కాంప్లెక్స్, జేజేఆర్ నగర్, ఎస్ఎం నగర్ బ్లాక్ 25 నుంచి 88, శ్యాంతిపూ కాలనీ, మల్లికపూ కాలనీ, ఆర్ఆర్ నగర్, కేప 4వ వీధి, తిరువళ్లువర్ నగర్, వ్యాసర్పాడి పుదునగర్, వెస్ట్ బ్లాక్, వెస్ట్ క్రాస్, సెంట్రల్ క్రాస్ 1 నుంచి 14 వీధులు, 5 నుంచి 9 క్రాస్ వీధులు, సెంట్రల్ అవెన్యూ, వెస్ట్ అవెన్యూ రోడ్డు, సీఎండబ్ల్యూఎస్ఎస్బీ పంపింగ్ స్టేషన్, సెంట్రల్ క్రాస్ 10 నుంచి 19 వీధులు, 4,7,8 మెయిన్ రోడ్లు, నార్త్ అవెన్యూ రోడ్డు, పారియర్ కోచర్స్

**ముడిచూర్:** లక్ష్మి నగర్ వెస్ట్, ఈస్ట్, సౌత్, కక్కన్ వీధి, బాలాజి నగర్, ఈబీ కాలని, ఈశ్వరన్ నగర్, ఎంజీఆర్ నగర్, లింగం నగర్

**రాజకీల్పాక్కం:** వేళచ్చేరి మెయిన్ రోడ్డు, మెహతా నగర్ మెయిన్ రోడ్డు, మహాలక్ష్మి నగర్ మెయిన్ రోడ్డు, మారుతి నగర్, గోమతి నగర్, అయ్యప్ప నగర్, వివేకానందన్ వీధి, రాసుగి వీధి, వేణుగోపాల వీధి, అన్నా వీధి, భారతియార్ వీధి, తిరుమగళ్ నగర్, కార్తీక్ అవెన్యూ, ప్రదీప్ అవెన్యూ, గురునాధర్ వీధి, రంగా కాలని, వీఓసీ వీధి, నేతాజి వీధి, భావనందియార్ వీధి, మారిఅమ్మన్ ఆలయ వీధి, శ్యామ్ అవెన్యూ, సెంబాక్కం మెయిన్ రోడ్డు, మహాలక్ష్మి కాలని, ఐఓబీ కాలని, క్యాంప్ రోడ్డు, కర్మమ్ వీధి, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, కన్నన్ నగర్, అవ్వై నగర్, భారతి నగర్, మాదంబాక్కం మెయిన్ రోడ్డు, పొన్నియమ్మన్ ఆలయ వీధి, చిన్మయ కాలనీ, కంబార్ వీధి, మణిగవాస్కర్ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, కనకరాజ్ నగర్, అంబేడ్కర్ నగర్, అన్నా వీధి, రాజీవ్‌గాంధీ నగర్, కలైంజర్ కరుణానిధి నగర్, దుర్గా కాలనీ, వెంకట్రామన్నన్ నగర్, శివగామి నగర్, ముత్తమిళ్ నగర్, చిట్లపాక్కం, మానవాళ నగర్, అయ్యప్ప నగర్, ఏరికరై వీధి

**కొవ్వూరు:** పుదువేడు, అగ్నీశ్వరర్ ఆలయ వీధి, మూద్రామ్ కట్టలై మెయిన్ రోడ్డు, తిరుమలై నగర్, నాలుగు రోడ్ల జంక్షన్, ఏరికరై రోడ్డు.


'కరుప్పు పల్సర్'లో ఓ దృశ్యం

## ఇద్దరు భామలతో దినేష్ రొమాన్స్

డైరెక్టర్ ఎం.రాజేష్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన మురళి క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'కరుప్పు పల్సర్' మూవీలో దినేష్ హీరోగా నటిస్తూ తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఆయన సరసన రేష్మా వెంకట్, మధుమిత హీరోయిన్లుగా నటిస్తున్నారు. మన్సూర్ అలీఖాన్, ప్రిన్స్ అజయ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. యషో ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై డాక్టర్ ఎం.సత్య నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్‌ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ చిత్రం వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'జల్లికట్టు పోటీ విజేతలకు వివిధ రకాల బహుమతులు ఇస్తుంటారు. అయితే, గ్రామీణ, పట్టణ యువకులుగా దినేష్ నటిస్తున్నారు. జల్లికట్టు పోటీల్లో పాల్గొనే యువకుడిగా నటించే దినేష్‌కు ఈ పోటీలో 'కరుప్పు పల్సర్' బహుమతిగా వస్తుంది. పట్టణ యువకుడు డబ్బు సంపాదించి పొదుపు చేసి ఉన్నతస్థితికి రావాలని భావిస్తుంటాడు. వీరిద్దరూ ఒక విషయంలో కనెక్ట్ అవుతారు. అది ఏంటన్నదే ఈ చిత్ర ప్రధాన కథ. తంజావూరు, మదురై, చెన్నైలో 35 రోజుల పాటు షూటింగ్‌కు ప్లాన్ చేసి 23 రోజుల్లోనే పూర్తి చేశాం. తంజావూరులో జరిగిన జల్లికట్టు పోటీల్లో దినేష్ బరిలోకి దిగి ఎద్దును నిజంగానే నిలువరించారు. మార్చిలో విడుదల చేయాలని భావిస్తున్నాం. ఇటీవల విడుదల చేసి ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది' అని వివరించారు.

## 'పరాశక్తి' టైటిల్ ఎవరూ ఉపయోగించొద్దు

● స్పష్టం చేసిన నేషనల్ పిక్చర్స్


'పరాశక్తి'లో శివాజీ గణేశన్ (ఫైల్‌ఫొటో)

మహానటుడు, దివంగత శివాజీ గణేశన్ నటించిన 'పరాశక్తి' మూవీని డిజిటల్ ప్రింట్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నందున ఆ చిత్ర టైటిల్ ఎవరూ ఉపయోగించవద్దని నిర్మాణ సంస్థ నేషనల్ పిక్చర్స్ స్పష్టం చేసింది. ఈ విషయంపై ఆ సంస్థ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. 'కృష్ణన్ - పంజు దర్శకత్వంలో కలైంజర్ కరుణానిధి సంభాషణలు సమకూర్చగా, శివాజీ గణేశన్‌ను హీరోగా తొలిసారి పరిచయం చేస్తూ 1952లో రూపొందించిన సినిమా ఇది. నేషనల్ పిక్చర్స్ బ్యానరుపై మా తాత పెరుమాళ్ ముదలియార్ నిర్మించారు. ఏవీఎం సంస్థ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పంపిణీ చేసింది. ఈ మూవీలో శివాజీ గణేశన్‌ను హీరోగా ఎంపిక చేసేందుకు ఏవీ మెయ్యప్ప చెట్టియార్ తీవ్ర అభ్యంతరం తెలిపినప్పటికీ పెరుమాళ్ ముదలియార్ పట్టువదలకుండా మొండిగా శివాజీని హీరోగా కొనసాగించారు. హీరోగా తనను పరిచయం చేసినందుకు కృతజ్ఞతగా శివాజీ జీవించివున్న రోజుల్లో ప్రతి సంక్రాంతి పండుగ రోజున వేలూరు వచ్చి పెరుమాళ్ ముదలియార్ ఆశీర్వాదం తీసుకునేవారు. మా తాత నిర్మాణంలో వచ్చిన గర్వించదగిన ఆణిముత్యం 'పరాశక్తి'. త్వరలోనే సిల్వర్ జూబ్లీ (75యేళ్ళు) జరుపుకోనున్న తరుణంలో ఈ మూవీని డిజిటల్ ప్రింట్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేయనున్నామనే సంతోషకరమైన వార్తను తమిళ సినీ అభిమానులకు తెలియజేసేందుకు గర్విస్తున్నాం. ఈ తరుణంలో మూవీపై సంపూర్ణ హక్కులు కలిగివున్న పరాశక్తి సినిమా టైటిల్ ఇతరులెవరూ ఉపయోగించవద్దని మనవి చేస్తున్నాం' అని నేషనల్ పిక్చర్స్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది. కాగా, శివకార్తికేయన్ హీరోగా తమిళంలో, విజయ్ ఆంటోనీ హీరోగా తెలుగులో 'పరాశక్తి' పేరుతో సినిమాలు రూపొందనున్నట్టు ప్రకటించడంతో ఈ సినిమా టైటిల్‌పై వివాదం చెలరేగిన విషయం తెల్సిందే.

చెన్నై ప్రత్యేకం

## తమిళ ప్రేక్షకులను ప్రేమిస్తా

● హీరో నాగ చైతన్య ● 'తండేల్' తమిళ ట్రైలర్ రిలీజ్


ట్రైలర్ లాంచ్ వేడుకలో సాయిపల్లవి, నాగ చైతన్య

చెన్నై నగరం తనకు ఎంతో పత్యేకమని, తమిళ ప్రేక్షకులను ప్రేమిస్తానని టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య అన్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తండేల్'. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కగా, ఈ నెల 7వ తేదీ విడుదలకానుంది. నాగ చైతన్య, సాయి

తమిళ చిత్రజ్యోతి

పల్లవి, కరుణాకరన్, నరేన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై నిర్మాత బన్నీవాసు నిర్మించారు. తమిళంలో ప్రముఖ నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్ రిలీజ్ చేస్తుంది. తమిళ వెర్షన్ ట్రైలర్ రిలీజ్ వేడుక గురువారం రాత్రి నగరంలో జరుగగా, హీరో కార్తి, దర్శకులు వెంకట్‌ప్రభు, కార్తీక్ సుబ్బరాజ్ అతిథులుగా పాల్గొని ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. హీరో కార్తి మాట్లాడుతూ, 'తండేల్ ఓ రియల్ స్టోరీ.. నన్ను ఎంతగానో ప్రేరేపించింది సినిమాలో అద్భుతమైన నటన కనపరిచిన కరుణాకరన్, నరేన్, పాత్రల్లో జీవిస్తున్న సాయిపల్లవికి ధన్యవాదాలు. చై పాత్రలో అమయాకత్వం కనిపిస్తుంది. మూవీ సక్సెస్ సాధించాలని ఆకాంక్షిస్తున్నా' అని కోరారు. దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ, 'స్క్రిప్టుల ఎంపికపై చై ప్రత్యేకత చూపుతాడు. ఎంతో అంకితభావం ఉన్న నటుడు. 'తండేల్' కొత్త జోనర్‌లో వస్తుంది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు' అన్నారు. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ, 'ఈ మూవీ ట్రైలర్ ఎంతో ఆసక్తిని చూపిస్తుంది. సినిమా చూడాలని వుంది. టీమ్‌కు ఆల్ ది బెస్ట్' అన్నారు. హీరోయిన్ సాయిపల్లవి మాట్లాడుతూ, 'తండేల్ నిజమైన కథ. మరపురాని జర్నీ. ఈ సినిమా కోసం యేడాదిన్నర సమయాన్ని హీరో కేటాయించడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'ఒక మంచి కథతో వస్తున్నాం. దర్శకుడు ఒక అసాధారణమైన కథ సిద్ధం చేయగా, 20 మంది నుంచి రైట్స్ తీసుకోవడం జరిగింది. ఈ సినిమాను తమిళంలో విడుదల చేస్తున్న నిర్మాత ఎస్ఆర్ ప్రభుకు ధన్యవాదాలు' తెలిపారు. చిత్ర దర్శకుడు చంద్రూ మొండేటి మాట్లాడుతూ, 'ప్రజలు, ప్రాంతాలు, మాట్లాడే భాష వేరుకావొచ్చు. కానీ భావోద్వేగాలు మాత్రం ఒకటే. రియల్ స్టోరీని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. అని అంటూ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.


శివకార్తికేయన్

## పాత సినిమా టైటిళ్లపై ఎస్‌కే మొగ్గు

ఇటీవలికాలంలో తమిళ చిత్రపరిశ్రమలో పాత చిత్రాల టైటిల్స్‌తో కొత్త సినిమాలు తీయడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ఇలా పాత చిత్రాల టైటిల్స్‌తో సినిమాలు తీయడంలో హీరో శివకార్తికేయన్ (ఎస్‌కే) మొగ్గు చూపుతూ ఆ జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. తొలి స్థానంలో హీరో ధనుష్ ఉన్నారు. ఇప్పటివరకు ఎస్‌కే నటించిన చిత్రాల్లో అనేక చిత్రాలకు పాత సినిమాల టైటిల్స్‌ను ఉపయోగించారు. ఇలాంటి వాటిలో 'ఎదిర్‌నీచల్', 'కాక్కిసట్టై', 'వేలైక్కారన్', 'మావీరన్', 'అమరన్' వంటి సినిమాలున్నాయి. ఇపుడు తన కొత్త మూవీకి 'పరాశక్తి' అనే టైటిల్ పెట్టుకున్నారు. ఇలా పాత టైటిల్ ఉపయోగించుకోవడం ఆరోసారి. పాత చిత్రాల పేర్లను ఎందుకు ఉపయోగిస్తున్నారు, మరో పేరు లభించలేదా అని ప్రశ్నిస్తే, మా స్టోరీకి ఆ పేరు సరిగ్గా సరిపోతుందని దర్శక నిర్మాతలు సమాధానం చెప్పడం కూడా రొటీన్‌గా మారిపోయింది. అయితే, కొన్ని సందర్భాల్లో పాత సినిమా టైటిల్స్‌ను వాడుకోవడం వివాదాస్పదమవుతుంది.

## రాజధాని కళాశాలలో ముగిసిన పోటీలు

● విజేతలకు బహుమతుల ప్రదానం


అతిథులతో విజేతలు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాలోని రాజధాని కళాశాలలో జరిగిన వక్తృత్వ, క్విజ్ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. ప్రతియేటా కళాశాలలో తెలుగు వ్యాకరణ కర్త పరవస్తు చిన్నయసూరి పేరుతో వక్తృత్వ పోటీలు, కందుకూరి వీరేశలింగం పంతులు పేర ఉపన్యాస పోటీలు, కొక్కొండ వెంకటరత్నం పంతులు పేర క్విజ్ పోటీలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలు జరిగాయి. ఇందులో వక్తృత్వ పోటీలో మొదటి బహుమతిని డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల, రెండో బహుమతిని మీనాక్షి కళాశాల గెలుచుకున్నాయి. ఉపన్యాస పోటీలో మొదటి బహుమతి డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల, ద్వితీయ బహుమతి రాజధాని కళాశాల, తృతీయ బహుమతిని మీనాక్షి కళాశాల, కన్సోలేషన్ బహుమతిని తిరుత్తణి ప్రభుత్వ కళాశాల గెలుచుకున్నాయి. క్విజ్ పోటీలో మొదటి బహుమతిని డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల, ద్వితీయ బహుమతిని రాజధాని కళాశాల, తృతీయ బహుమతిని కందస్వామి నాయుడు కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఆకాశవాణిలో రిటైర్డ్ ఉద్యోగిణి గజగౌరి, రాజధాని కళాశాల ప్రాచార్యులు ఎల్‌బీ శంకరరావు వ్యవహరించారు. అనంతరం విజేతలకు న్యాయనిర్ణేతలు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలుగుశాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎలిజబెత్ అతిథులను సత్కరించారు.


అతిథులను సత్కరిస్తున్న డాక్టర్ ఎలిజబెత్

## ఘనంగా విక్రమ రాజసింహ జయంతి వేడుకలు

● హాజరైన రాజకుటుంబీకులు


నివాళిలర్పిస్తున్న రాజకుటుంబీకులు

వేలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలోని కాండీ రాజ్యాన్ని పాలించిన చివరి తమిళ మహారాజు విక్రమ రాజసింహన్ జయంతి సందర్భంగా శుక్రవారం వేలూరు పాత బస్టాండ్ ప్రాంతంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆయన వంశీయులైన పురుషోత్తమరాజు, మంజునాథరాజు, కుప్పుస్వామిరాజు, నవనీత తదితరులు పాల్గొని ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా విక్రమ రాజసింహ మునిమనవడైన పురుషోత్తమరాజు మాట్లాడుతూ, శ్రీలంకలోని కాండీ ప్రాంతాన్ని పాలించిన చిట్టచివరి మహారాజు విక్రమ రాజసింహన్ 1815వ సంవత్సరం వరకు పరిపాలించి, ఆ తర్వాత బ్రిటీష్ దాడులతో రాజ్యం విచ్ఛిన్నమైపోయి తమిళనాడులోని వేలూరుకు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారని తెలిపారు. ఆయన వంశంలో జన్మించడం తమకెంతో గర్వంగా వుందన్నారు. అనంతరం రాజకుటుంబీకులందరూ ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు నాయుడు సంఘ సెక్రటరీ గోపన్, ముక్తరయార్ సంఘ అధ్యక్షులు రాజమానిక్యం, ఓబీసీ జిల్లా కార్యదర్శి మురళీధరన్, జనార్ధనన్, యాదవ మహాసభ అధ్యక్షులు లోకనాధం తదితరులు పాల్గొన్నారు.




'ఏ కళలోనైనా రాణించాలంటే ముఖ్యంగా ఏకాగ్రత, అంకితభావం, పట్టుదల, అభ్యాసం ఉండాలి. శ్రద్ధాసక్తులతో నేర్చుకున్నప్పుడే ఏ పని అయినా విజయవంతం అవుతుంది. భవిష్యత్తులో డాన్స్ స్కూలు పెట్టాలన్నది నా ఆశయం' అంటూ తరుణితో తన మనసులోని భావాలను పంచుకుంది.

## బహుముఖ ప్రావీణ్యం

# కళామతల్లికి నీరాజనం

● నాట్యం, కొరియోగ్రఫీ, మోడలింగ్‌లో రాణిస్తున్న సుకన్యా విశ్వభరత్

లలితకళల్లో రాణించాలనుకునేవారికి సంకల్పం, సమర్థతతో పాటు అభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలి. కొందరికి నాట్యం వారసత్వంగా ప్రాప్తిస్తుంది. మరికొందరు తల్లిదండ్రుల ప్రోద్బలంతో అడుగుపెడుతుంటారు. బాల్యం నుంచే నాట్యం వైపు మొగ్గుచూపే వారు ఇంకొందరు. 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న చందాన మొగ్గతొడిగే వయస్సులోనే నాట్యం వైపు అడుగులేసింది సుకన్య. అభ్యాసంతో నాట్యాన్ని 'సుగ'మం చేసుకుంది. ఆ దిశగా విజయ శిఖరాల వైపు పయనిస్తున్న వర్ధమాన నాట్యకళాకారిణే సుకన్యా విశ్వభరత్. ఆమే నేటి మన తరుణి...

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి.

### జననం.. విద్యాభ్యాసం...

సుకన్య పుట్టిపెరిగింది చెన్నైలోనే. తండ్రి సుందరరాజన్, తల్లి విద్య. సుకన్య విద్యాభ్యాసం ఏంజెల్ మెట్రిక్యులేషన్ స్కూల్లో 12వ తరగతి వరకు కొనసాగింది. ఆ పైన ఎం.జి.ఆర్ జానకి కాలేజీలో నాట్యం, సంగీతం, రంగస్థలం ముఖ్యాంశాలుగా బి.ఏ పట్టా అందుకుంది. ఆ తర్వాత నాట్యంలో ఎం.ఏ డిగ్రీ సాధించింది.

### నాట్యాభ్యాసం...

బాల్యంలోనే సుకన్య నాట్యంపై మక్కువ చూపేది. "చిన్నతనంలో నాట్యం పట్ల ఆసక్తి గమనించిన ఆమె తల్లి ఆరేళ్ల వయస్సులోనే డాన్స్ క్లాస్‌లో చేర్పించి ప్రోత్సహించించింది. విజయలక్ష్మి శిక్షణలో 12ఏళ్ల వయస్సులో అరంగేట్రం చేసి, నాట్యప్రదర్శనలకు నాంది పలికింది. అంతేకాదు నాట్యగురువు డాక్టర్ సుజాత మోహన్ పథ నిర్దేశంలో భరతనాట్యంలో మరింత శిక్షణ తీసుకున్నారు. మరో గురువు 'కలైమామణి' గోపికా వర్మ నేతృత్వంలో మోహినీ అట్టమ్‌లో శిక్షణ పొంతీసుకుంది సుకన్య. ఈమెకు జానపద కళలంటే కూడా ఎంతో ఇష్టం. అందులో నిష్ణాతుడైన విశ్వభరత్ వద్ద శిక్షణ పొందింది. తన జీవన సహచరుడైన విశ్వభరత్ వద్దనే తమిళ ప్రాచీన సంప్రదాయ జానపద కళలైన 'గరగాట్టమ్' ఓయిలాట్టమ్' 'పారై' వంటి జానపద నృత్యాలు నేర్చుకుంది.


మంత్రి తంగం తెన్నరసు, ఎంపీ కనిమొళితో సుగన్య బృందం

### ఉద్యోగ జీవితం...

తను చదువుకున్న డాక్టర్ ఎంజీఆర్ జానకి కళాశాలలో నాట్యశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సుకన్య పనిచేసారు. కొన్నేళ్ల తర్వాత తన నాట్య ప్రదర్శనలకు ఉద్యోగం అంతరాయం అవుతున్నదన్న భావనతో ఉద్యోగానికి స్వస్తి పలికి తన సమయాన్ని అధికంగా నాట్యప్రదర్శనలు, మోడలింగ్‌కు కేటాయిస్తోంది.

### కుటుంబ నేపథ్యం...

'తమిళ యువతి అయిన సుకన్య తెలుగింటి కోడలు కావడం విశేషం. ఆమె అత్తమామలు కళాభిరుచిని ఎంతో ప్రోత్సహిస్తారని, వారి సహకారం వల్లనే తాను ఒత్తిడి లేకుండా నాట్య ప్రదర్శనలు ఇవ్వగలుగుతున్నానని గర్వంగా చెబుతుంది సుకన్య. ఆమె భర్త విశ్వభరత్ కూడా కళాకారుడు కావడంతో నాట్యాభ్యాసానికి, ప్రదర్శనలకు సహకారం ఎక్కువగా ఉంది. అంతేకాదు భార్యాభర్తలిద్దరు కలిసి జానపదకళా ప్రదర్శనలివ్వడం విశేషం.

### నాట్య ప్రదర్శనలు...


భర్త విశ్వభరత్‌తో...

సుకన్య చెన్నైలో ఎన్నో సభల్లో తన 'భరతనాట్య' ప్రదర్శనలతో ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. రాష్ట్రంలో సుప్రసిద్ధ దేవాలయాల్లో కూడా ప్రదర్శనలిచ్చింది. 2023లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన చెన్నై సంగమమ్‌కి అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేసింది. ఇంకా చెన్నైలోని ఎన్నో కళాశాలలు, పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు కొరియోగ్రాఫర్‌గా సేవలందించింది. విజయ్ టీవీ,జీ తమిళ్,సన్‌టీవీ వంటి టీవీ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'తలైవి' చిత్రంలో సుకన్య తన నాట్య ప్రతిభ ప్రదర్శించింది. చెన్నైలో జరిగిన 44వ చెస్ ఒలింపియాడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా సుకన్య తన నాట్య ప్రదర్శన చేసింది. ప్రస్తుతం ఫ్రీలాన్స్ నృత్యకళాకారిణిగా నగరంలోని ప్రఖ్యాత నృత్య సంఘాల్లో పనిచేస్తోంది.మోడలింగ్ పట్ల అభిరుచి కలిగిన సుకన్య పెళ్లికూతురుగా మోడలింగ్ చేసింది.మోడలింగ్‌లో కూడా ఇంకా ముందుకు వెళ్లాలన్నదే తన ఆశయమని తెలిపింది.


ప్రశంసా పత్రం అందుకుంటున్న రవళి

## అందెల రవమిది పదములదా...

● అలరించిన రవళి నృత్యం


రవళి అభినయం

ప్యారీస్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని రసికరంజని సభ వేదికగా అనుషం ఆర్ట్స్ వార్షిక ఫెస్టివల్‌లో గురువారం రాత్రి ప్రముఖ నర్తకి రవళి భరతనాట్యం ఆద్యంతం ఆకట్టుకుంది. గణపతి పంచరత్నం కీర్తనతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో కావడి సింధు, థిల్లానా నాట్య భంగిమలు, హావభావాలు ప్రదర్శించిన రవళిని ప్రేక్షకులు అభినందించారు. అంతర్జాతీయ భరతనాట్య కళాకారిణి కలైమామణి ఆచార్య అనిత గుహ (నృత్య దర్శకత్వం), విద్వాన్ కె.హరిప్రసాద్ (గాత్రం) జయశ్రీ రామనాథన్ (నట్టువాంగం), రామ్‌శంకర్‌బాబు (మృదంగం), ఈశ్వర రామకృష్ణన్ (వయోలిన్), శృతిసాగర్ (ఫ్లూట్)లతో రవళి నాట్యానికి వాద్య సహకారమందించారు. భరతనాట్యంలో నిష్ణాతుడైన గిరిధర్ మైలవరపు కుమార్తె అయిన రవళి ఐదేళ్ల ప్రాయంలోనే తండ్రివద్ద నాట్యం నేర్చుకుని నాట్యగురువు అనితా గుహ వద్ద శిక్షరికం చేసి భరతనాట్యంలో మెలుకువలు నేర్చుకుని 13వ ఏట 2018లో మైలాపూర్ మ్యూజిక్ అకాడమీలో అరంగేట్రం చేసి, పలువురి ప్రశంసలందుకుంది. రవళి తంజావూర్‌లోని తమిళ విశ్వవిద్యాలయంలో భరతనాట్యంలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ పూర్తిచేసి, ఐఎంటీ ఘజియాబాద్‌లో మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ పొందింది. అపస్వరం రామ్‌జీ మార్గదర్శకత్వంలో కర్ణాటక సంగీతాన్ని కూడా నేర్చుకుంది. నిర్వాహకులు రవళికి ప్రసంశా పత్రం అందజేసి సత్కరించారు.


రైల్వే విభాగంలో విశేష సేవలందించిన కె.సుజితను చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 'రైల్ విశిష్ట సేవ' పురస్కారం అందజేస్తున్న దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ ఎన్ సింగ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కౌశల్ కిశోర్

## అరుణాచలేశ్వరుడి సేవలో రవిశంకర్

● తిరువణ్ణామలై ఆలయంలో ప్రత్యేక పూజలు

వేలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక గురువు వాలుమ్‌కలై వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ శుక్రవారం తెల్లవారుజామున తిరువణ్ణామలై ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణ నడుమ అరుణాచలేశ్వరునికి దర్శించుకుని, అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆయన చేతులమీదుగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

### అన్నామలైయార్‌ను దర్శించుకున్న కంచిపీఠాధిపతి

తిరువణ్ణామలైలోని అన్నామలైయార్‌ను శుక్రవారం సాయంత్రం కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయానికి వచ్చిన విజయేంద్ర సరస్వతికి శివాచార్యులు గౌరవ సత్కారాలతో ఆహ్వానించారు. అనంతరం అన్నామలైయార్, ఉన్నామలై అమ్మన్‌లను దర్శనం చేసుకున్న స్వామి వినాయక సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆలయ అర్చకులతో రవిశంకర్

## నగరానికి చేరుకున్న కమల్ హాసన్

అడయార్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అగ్రనటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ తన విదేశీ పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్నారు. ఇటీవల ఆయన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విద్య నేర్చుకునేందుకు అమెరికా వెళ్ళిన విషయం తెల్సిందే. ఈ కోర్సు పూర్తి చేసుకున్న ఆయన ఐదు నెలల తర్వాత స్వదేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'థగ్‌లైఫ్' మూవీ నిర్మాణపనులన్నీ పూర్తి చేసి, జూన్ 5వ తేదీ విడుదల చేయనున్నట్టు తెలిపారు. 'విక్రమ్' మూవీ రెండో భాగం వచ్చే అవకాశం ఉందా అని ప్రశ్నించగా, అలాంటి అవకాశం లేదన్నారు. పైగా తాను ఒక కథ సిద్ధం చేశానని వెల్లడించారు. 'థగ్‌లైఫ్'లో తన భాగం షూటింగు పూర్తి చేసిన తరువాతే కమల్ అమెరికాకు వెళ్ళిన విషయం తెల్సిందే.

kumbhamEla

కుంభమేళా నమూనా ఆలయంలో

## రోజుకు 10వేలమందికి దర్శనం



● టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద మహా కుంభమేళాలో టీటీడీ నమూనా ఆలయంలో రోజుకు 8 నుంచి 10 వేలమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అన్నమయ్య భవనంలో శుక్రవారం బోర్డు సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమల తరహాలోనే శ్రీవారి కైంకర్యాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. తిరుమల నుంచి వెళ్లిన పోటు సిబ్బందితో ప్రసాదాలను తయారు చేసి వితరణ చేస్తున్నామని తెలిపారు. మహాకుంభమేళాలో దాదాపు 250 మందికిపైగా టీటీడీ ఉద్యోగులు సేవలందిస్తున్నారంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## తిరుమలలో 'లైలా' హీరో



విశ్వక్‌సేన్ - సత్యాత్మతీర్థ స్వామిజీ

కాలినడకన తిరుమలకు చేరుకున్న హీరో విశ్వక్‌సేన్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఫిబ్రవరి 6 'లైలా' సినిమా ట్రైలర్ విడుదల కాబోతున్న సందర్భంగా తిరుమల దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. 'లైలా'లో తాను అమ్మాయి వేషం వేశానని, తన జీవితంలో ఈ సినిమా ప్రత్యేకం అని అన్నారు. ప్రతి సినిమా విడుదలకు ముందు తాను తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకుంటున్నానని తెలిపారు. 'లైలా' విడుదల తర్వాత కూడా మరోసారి తిరుమలకు వస్తానన్నారు. త్వరలో 'ఫంకీ' చిత్రం షూటింగ్ మొదలవుతుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. కాగా ఉత్తరాధి మఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ, సినీ నిర్మాత సుధాకర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## సర్వదర్శనానికి 5 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 4 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.65 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 51,349

తలనీలాలు సమర్పించినవారు : 14,082



# పాతాళగంగ కాస్త కనికరించింది

● జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం

● తిరుపతికి మాత్రం ప్రమాద ఘంటికలు

- తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి




తుపానులు కురిపించిన వరుస వానలు జిల్లాలో భూగర్భ జలమట్టాలను ఈ ఏడాది స్వల్పంగా పెంచాయి. సగటున జిల్లా మొత్తం పది అంగుళాలు నీటి మట్టం పెరిగింది. తూర్పు మండలాల్లో అయితే ఈ పెరుగుదల గణనీయంగా ఉంది. 2023 డిసెంబరుతో పోలిస్తే 2024 డిసెంబరు నాటికి ఆశాజనకమైన జలమట్టం కనిపిస్తోంది. తాగునీటికి, సాగుకూ ఇది సంతోషాన్ని కలిగించే అంశం. ఇన్ని వానలు కురిసినా జిల్లా కేంద్రమైన తిరుపతిలో మాత్రం భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. రానున్న వేసవికి ప్రమాదకరమైన పరిస్థితులను ఇవి సూచిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం కురిసిన వానలు భూగర్భంలోకి ఇంకే వీలు లేకపోవడం. కాంక్రీటు జనారణ్యంగా మారిపోయిన తిరుపతిలో నీటి కుంటలు, చెరువులు ఆక్రమణలపాలై నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. కొండలమీద కురిసిన వానంతా మాలాడగుండం, కపిలతీర్థం సహా నగరంలోంచే వెల్లువలా ప్రవహించినా చుక్కనీరు నిలిచే అవకాశం లేక కిందికి వెళ్లిపోతున్నాయి. ఈ కాలువల్లో నీరు భూగర్భంలోకి ఇంకకుండా కాంక్రీటు ఫ్లోరింగ్ వేసేయడానికి మించిన అనాలోచిత చర్యల ఫలితమే ఇది. ఈ వానలకు కాళంగి, మల్లిమడుగు నిండి పొంగి పారినా.. కళ్యాణిడ్యాం నిండనే లేదు. యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో వర్షపాతం కూడా తక్కువగానే నమోదైంది. జిల్లా తూర్పు మండలాల్లో వరదయ్యపాళెంలో 0.33 మీటర్లు, కోట 0.84, బీఎన్‌కండ్రిగ 0.85, కేవీబీపురం 0.99, వాకాడు 1.20, పిచ్చాటూరు 1.20, చిట్టమూరు 1.31, చిల్లకూరు 1.48, రేణిగుంట 1.99 మీటర్లు వంతున భూగర్భ జలాలు పెరగడం ఈ ఏడాది విశేషం.

### అవసరం మేరకే వాడుకోండి



తిరుపతి జిల్లాలో 2023లో నమోదు అయిన వర్షపాతంతో పోలిస్తే గత డిసెంబరు చివరి నాటికి వర్షాలు బాగా పడ్డాయి. భూగర్భ జలనీటిమట్టాలు పెరిగాయి. అలా అని నీటిని వృథా చేయకూడదు. అవసరం మేరకే వినియోగించుకోవాలి.

- నాగమల్లేశ్వరరావు, జిల్లా భూగర్భ జల అధికారి

**భూగర్భ జలాలు ఇలా.. (మీటర్లలో)**

| | 2023 డిసెంబరు | 2024 డిసెంబరు |
|---|---|---|
| తిరుపతి | 14.80 | 16.86 |
| చంద్రగిరి | 4.80 | 4.76 |
| నగిరి | 3.68 | 3.04 |
| సత్యవేడు | 2.94 | 2.46 |
| శ్రీకాళహస్తి | 2.45 | 2.44 |
| సూళ్ళూరుపేట | 1.99 | 1.72 |
| వెంకటగిరి | 2.51 | 2.24 |
| గూడూరు | 1.55 | 1.76 |
| జిల్లా సగటు | 3.19 | 3.09 |

**2024 జూన్- డిసెంబరు మధ్య వర్షపాతం (మి.మీ.లో)**

| మండలం | సాధారణం | కురిసింది |
|---|---|---|
| గూడూరు | 943.2 | 1.066.7 |
| కోట | 1135.1 | 1456.6 |
| వాకాడు | 1113.2 | 1589.3 |
| చిట్టమూరు | 1018.6 | 1475.8 |
| నాయుడుపేట | 982 | 1231.1 |
| పెళ్లకూరు | 1,036 | 1303.4 |
| డివీసత్రం | 1212.8 | 1569.9 |
| సూళ్ళూరుపేట | 1234.2 | 1889.1 |
| తడ | 1294.2 | 1509.9 |
| తిరుపతి రూరల్ | 895.7 | 1288.3 |
| ఎర్రావారిపాళెం | 681.1 | 767.7 |
| పాకాల | 886.8 | 1302 |
| రేణిగుంట | 1021.7 | 1340 |
| శ్రీకాళహస్తి | 1177.4 | 1149.4 |
| తిరుపతి అర్బన్ | 994.7 | 1206.4 |
| చంద్రగిరి | 906.5 | 1188.9 |

## కోర్టుకు వస్తారా? అరెస్టు వారెంట్ ఇవ్వాలా?

● హోంశాఖ కార్యదర్శికి హైకోర్టు హెచ్చరిక

● హూటాహూటిన న్యాయస్థానంలో హాజరైన ధీరజ్ కుమార్

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సాయంత్రంలోగా కోర్టుకు హాజరుకాకుంటే అరెస్టు వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. మద్రాసు హైకోర్టులో గురువారం ఓ కేసు విచారణ జరిగిన నేపథ్యంలో, కోర్టు ఉత్తర్వులను పోలీసులు పాటించడం లేదంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయమూర్తి జస్టిస్ వేల్ మురుగన్.. ఈ వ్యవహారంపై శుక్రవారం హాజరై వివరణ ఇవ్వాలని హోంశాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్‌ను ఆదేశించారు. కానీ, శుక్రవారం ఉదయం కోర్టుకు హాజరైన ప్రభుత్వ న్యాయవాది.. హోంశాఖ కార్యదర్శి ప్రభుత్వ కార్యక్రమాలున్నాయని, అందువల్ల ఆయన హాజరుపై మినహాయింపు ఇవ్వాలని జస్టిస్ వేల్ మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు పిటిషన్ వేశారు. దీంతో అసంతృప్తి చెందిన న్యాయమూర్తి.. సాయంత్రం 4.30 గంటలకు రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి కోర్టుకు స్వయంగా హాజరు కావాలని, లేనిపక్షంలో సుప్రీంకోర్టులో స్టే ఉత్తర్వులు పొందాలని, ఈ రెండు చేయని పక్షంలో ఆయనకు వ్యతిరేకంగా పీడీ వారెంట్ జారీచేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో ధీరజ్‌కుమార్ హూటాహూటిన సాయంత్రం 4.30 గంటలకు కోర్టులో హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. హోంశాఖ కార్యదర్శిని రప్పించాలనేది తమ ఉద్దేశం కాదని, పోలీసుశాఖలో జరుగుతున్న విషయాలు తెలుసుకొనేందుకు స్వయంగా హాజరుకావాలని మాత్రమే ఉత్తర్వులు జారీచేశామన్నారు. విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన ఛార్జిషీటు దాఖలు వేగవంతం చేయాలని పోలీసులకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

## విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన



తిరుత్తణి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పోతదూర్‌పేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్.శ్రీనివాస్ పెరుమాళ్ ఆదేశాల మేరకు విద్యార్థినిలపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు, విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమాన్ని ఎస్ఐ ఎరోమియాస్ ఆంథోనిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు బాబు, నరసింహన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తిరుత్తణి మురుగన్ గ్రామోత్సవం



తిరుత్తణి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయాల్లో ఒకటైన తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఏడాదికి ఒకసారి చేసే తైమాస గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి వీరరాఘవపురం వరకు నిర్వహించే ఈ ఊరేగింపులో వళ్లీ,దేవసేన సమేతుడైన సుబ్రమణ్యస్వామి గ్రామ వీధుల్లో విహరించారు.



ఒక్కరోజు పర్యటన కోసం శుక్రవారం చెన్నై వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న బీజేపీ రాష్ట్ర కో-ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకురాలు డాక్టర్ తమిళిసై తదితరులు

## భక్తిశ్రద్ధలతో వాసవాంబ ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్కేపీడీ ఛారిటీస్ నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జ్‌టౌన్‌లో మూడువందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ) ఛారిటీస్ ఆధ్వర్యంలో వాసవాంబ ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పవిత్రజలాలు, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు, పట్టువస్త్రాలు, ఎర్రగులాబీలతో విశేషఅలంకరణ, మంగళహారతి, మహాదీపారాధన ఘనంగా నిర్వహించారు. ఎస్కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, సీఆర్ కిషోర్‌బాబు, టీఎస్ బద్రినాథ్, టీవీ రామకుమార్, మాజీ సభ్యులు, ఎస్కేపీడీ నిర్వాహణలోని విద్యా సంస్థల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ ట్రస్టీ ఊరా ఆంజనేయులు వైశ్యుల గోత్రాలు, వాసవీ మాత బలిదానం గురించి వివరించారు. భక్తులందరికి అన్నప్రసాదాలు పంపిణీ చేసిన నిర్వాహకులు ఉభయదారులను సత్కరించారు.

**పాదయాత్ర...**

వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జై సరస్వతి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పీవీ కృష్ణారావు, మణిమాలారావు నేతృత్వంలో అన్నానగర్ శాంతికాలనీ పర్‌ఫెక్ట్ టవర్స్ నుండి ఎస్కేపీడీ వరకు సుమారు 15కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. వాసవీ క్లబ్ మొగప్పేర్ అధ్యక్షులు ఎన్ఎస్ఎం సతీష్, కార్యదర్శి కె.కవితా రమేష్, పొన్నూరి సత్యన్నారాయణ, కేకే త్రినాధ్‌కుమార్, ఉమ్మిడి పుణ్యకోటి, పొన్నూరి సుధాకర్, సుమన్ తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

## నేటినుంచి 'ఇంటర్నేషనల్ లెదర్ ఫేర్'




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో శనివారం 'ఇంటర్నేషనల్ లెదర్ ఫేర్' ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు సాగనున్న ఈ ప్రదర్శనకు దేశవిదేశాల నుంచి వేలాదిమంది పారిశ్రామికవేత్తలు రానున్నారు. ఈ వివరాలను ఐటీపీవో జనరల్ మేనేజర్ లెఫ్టినెంట్ కల్నల్ హర్ష కౌండిల్య, రీజనల్ చైర్మన్ అబ్దుల్ వహాబ్, ఐటీపీవో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సెల్వం శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. అతిపెద్ద ఆవిష్కరణలు, సాంకేతికతకు ఈ ప్రదర్శన వేదిక కానుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో తోలు, పాదరక్షల పరిశ్రమలకు సంబంధించిన ముడిపదార్థాల నుంచి తుది ఉత్పత్తుల వరకు అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తారని వివరించారు. బ్రెజిల్, ఫ్రాన్స్ జర్మనీ, ఇటలీ వంటి దేశాల ప్రతినిధులు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

## మంచుపరదాల మాటున ఊటీ



చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతం ఊటీలో గత వారం రోజులుగా దట్టమైన మంచు అలముకుంటోంది. వేకువజాము నాలుగు గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు నగరం నలుమూలల దట్టమైన పొగ మంచు దుప్పటిలా పరచుకుటోంది. దీంతో ఊటీ బొటానికల్ గార్డెన్, తలైకుందా, కామరాజర్‌సాగర్ డ్యామ్, షూటింగ్‌మట్టం, రేస్‌కోర్సు మైదానం, లవడేల్ తదితర ప్రాంతాల్లోని పచ్చికబయళ్లపై దట్టమైన మంచుపరచుకుంటోంది. బొటానికల్ గార్డెన్‌లో పూలమొక్కలు ఈ మంచుకు దెబ్బతినకుండా ఉండేందుకు వాటిపై టార్పాలిన్ కప్పుతున్నారు.

## ఇంటర్వ్యూ



**డాక్టర్ నడింపల్లె సత్యనారాయణరాజు,**
తిరుపతి పుస్తకోత్సవం నిర్వాహకుడు

భారతీయ భవన్ అనగానే గుర్తొచ్చే పేరు నడింపల్లె సత్యనారాయణరాజు. తిరుపతిలో 20 ఏళ్లుగా పుస్తక ప్రదర్శల నిర్వహణ వెనుక ప్రధాన వ్యక్తీ, శక్తీ ఆయనే. టీటీడీ అధికారుల సహకారం తీసుకుంటూ, తిరుపతిలోని మేధోవర్గం సహాయం అందుకుంటూ పుస్తకోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నిర్వహణ అంత తేలికైన పని కాదు. పుస్తకం మీద ఉన్న ఇష్టం, భావి తరాల పట్ల ఉన్న బాధ్యత ఆయనను వయసును లెక్క చేయకుండా పుస్తకోత్సవ సారధిగా నడిపిస్తోంది. పుస్తకోత్సవాల నిర్వహణ సాదకబాధకాలపై భారతీయ విద్యా భవన్ తిరుపతి డైరెక్టర్ డాక్టర్ నడింపల్లె సత్యనారాయణ రాజుతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

# ఈ తరం పుస్తకం చేతపట్టాలి



● **తిరుపతిలో ఎలా మొదలైంది?**

! 2006 లో భారతీయ విద్యా భవన్ స్వతంత్రంగా తిరుపతి పుస్తక ప్రదర్శనను ప్రారంభించింది. మొదట త్యాగరాజ మండపంలో నిర్వహించేవాళ్లం. సందర్శకుల సంఖ్య పెరగడంతో దానిని ఎస్వీ హైస్కూల్ మైదానంలోకి మార్చాం. ప్రస్తుతం విశాలమైన వినాయక నగర్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నాం. ఇరవై ఏళ్ళుగా తిరుపతి పుస్తక ప్రదర్శన మార్పుచేర్పులతో కొనసాగుతూ ఉంది.

● **ఉద్దేశ్యం ఏమిటి?**

! ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించిన ప్రముఖులందరూ మంచి పుస్తకాలు చదివి స్ఫూర్తి పొందిన వారే. పుస్తకం మనిషిని తీర్చి దిద్దుతుంది. ఆధునిక సాంకేతికత పెరగడంతో పుస్తక పఠనం తగ్గింది. టీవీలు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వెంట పరుగులు తీస్తున్న తరాన్ని మళ్లీ పుస్తకాల వెంట నడిపించాలనే ఆలోచనతోనే బాధ్యతగా భారతీయ విద్యా భవన్ పుస్తకోత్సవాలను ఏటా నిర్వహిస్తోంది.

● **నిర్వహణలో కష్టనష్టాలు?**

! దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పబ్లిషర్స్‌ను, విక్రేతలను తిరుపతికి రప్పించడం అంత సులువు కాదు.అందరినీ ఒక చోటుకి తీసుకువచ్చినా ప్రజలు రావాలి కదా. అన్ని విద్యాసంస్థలను సంప్రదించి, విద్యార్థులను తీసుకువచ్చి, వారికి ప్రతిభా పోటీలు నిర్వహించి,బహుమతులు అందించే పని చేస్తున్నాం.సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రదర్శనకు వచ్చినవారు రెండు మూడు గంటల పాటూ ప్రాంగణంలో గడుపుతారు. వీరి కోసం ఫుడ్ స్టాల్స్ కూడా ఉంటాయి. ఇవన్నీ కష్టమైన పనులే కానీ ప్రయాసగా భావించడం లేదు. భవిష్యత్ తరాలకు పుస్తకాన్ని వారసత్వంగా అందించే బాధ్యత అనుకుని నిర్వహిస్తున్నాం.

● **ఆర్థిక వనరులు ఎలా?**

! ఒక సారి పుస్తక ప్రదర్శన నిర్వహించాలంటే రూ. 11 లక్షలు ఖర్చు అవుతుంది. ఒక్కో స్టాల్‌కు రూ. 12 వేల చొప్పున ప్రవేశ రుసుం నిర్ణయించాం. ఇలా రూ. 6 లక్షలకు పైగా నిధులు వస్తున్నాయి. మిగిలిన ఆర్థిక భారాన్ని భారతీయ విద్యా భవన్ ద్వారా వెచ్చిస్తున్నాం. టీటీడీ కొన్ని సదుపాయాలు కల్పిస్తూ ఉంది. ఇది కొంత ఊరటను ఇస్తూ ఉంది.

● **భవిష్యత్తులో ఏ మార్పులు అవసరం?**

! ఇరవై ఏళ్ల క్రితం తిరుపతికీ, ఇప్పటి తిరుపతికీ చాలా మార్పులున్నాయి. ఐఐటీ, ఐజర్, వేద వర్సిటీ వంటి సంస్థలు నెలకొన్నాయి. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన కాలేజీలు పెరిగాయి. విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే వీరికి పుస్తకాల అవసరం పెరిగింది. ఆయా రంగాల్లో మరింత జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఉన్న అవకాశాలను కల్పించాలి. పుస్తక ప్రదర్శన ఇందుకు వేదిక అవుతోంది. టెక్నాలజీతో పాటు ఇతర అంశాలతో కూడిన పుస్తకాల సంఖ్య ప్రదర్శనలో పెరగాలి. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్, పెంగ్విన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ప్రచురణ, పుస్తక విక్రయ సంస్థలను తిరుపతికి తీసుకురావాలని కోరిక. హైదరాబాద్, విజయవాడ పుస్తక ప్రదర్శనలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో తిరుపతి పుస్తక ప్రదర్శన చేపట్టాలనే లక్ష్యం ఉంది.పుస్తక ప్రేమికుల ఆదరణతో ఇది సాధ్యమవుతుందనే నమ్మకమే నడిపిస్తోంది.